క్లుప్తంగా

చిన్నారులకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు

చెరుకుపల్లి: మండలంలో పుట్టిన బిడ్డ నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల ఆధార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ కొరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో పుట్టిన బిడ్డ నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు తల్లిదండ్రులు ఆధార్‌కార్డు తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం మండల పరిధిలోని కనగాల, గుళ్ళపల్లి, రాంబొట్ల పాలెం సచివాలయాలలో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ తెలిపారు. చిన్నారులకు ఆధార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేవారు వారి వెంట పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల ఒరిజినల్ ఆధార్ కార్డులు తీసుకురావాలన్నారు. ఇందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. కావున 0-6 సంవత్సరాల చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాంచాళవరంలో 'పొలం పిలుస్తోంది'



అమర్తలూరు(వేమూరు): మినుము, పెసర పైర్లు పూత, పిందె దశలో ఉన్నాయని, రైతులందరు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము, పెసర పూత, పిందె దశలో కాయ తొలుచు పురుగు ఉధృతంగా ఉంటే ఇమామెక్టిన్ ప్రోక్లెన్ పురుగు మందు పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. ఫ్రైడ్ పురుగు మందు ఎకరానికి 100 గ్రాములు లేదా ఎఫిఫేట్ ఎకరానికి 320 గ్రాములు పిచికారీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులు త్వరగా వసూలు చేయండి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ఇంటి పన్నులను త్వరగా వసూలు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు ఆదేశించారు. 30వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయంకు వెళ్లి రికార్డులు పరిశీలించారు. ఇంటి పన్నుల వసూలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇంటి పన్నుల వసూలు నూరుశాతం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రిఫ్లక్షన్‌తో పిల్లల్లో ఆత్మవిశ్వాసం



తెనాలిఅర్బన్: రిఫ్లక్షన్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వలన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో రిఫ్లక్షన్ పేరుతో మంగళవారం ఏర్పాటు చేసిన అకాడమిక్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పోల్చుకుంటే పిల్లల ఐక్యూలో చాలా వ్యత్యాసం ఉందన్నారు. విద్య విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యాబోధన చేయాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. కార్యక్రమంలో లీడ్ సంస్థ సీనియర్ అకాడమీ అడ్వయిజర్ బీవీ సుధాకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోండి



తెనాలిఅర్బన్: పట్టణంలోని చిరువ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. చెంచుపేటలో మంగళవారం ఆయన పర్యటించారు. వ్యాపారుల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్‌లపై ఆరా తీశారు. ఇప్పటి వరకు లైసెన్స్ తీసుకుని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లైసెన్స్ తీసుకోవడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ పథకాలు లైసెన్స్ ఉన్నవారికి ఇస్తారనే విషయాన్ని తెలియజేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

అవినీతి అడ్డా.. మెప్మా కార్యాలయం

- నకిలీ గ్రూపులతో రూ.కోట్లలో రుణం
- అక్రమాలు బయటపడటంతో పరస్పర ఫిర్యాదు



మున్సిపల్ కార్యాలయం

బాపట్ల: బాపట్ల మున్సిపాల్టీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గ్రూపు సభ్యులకు తెలియకుండా రూ.లక్షల్లో రుణాలు ఇప్పించి రూ.వేలల్లో ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. బ్యాంకులు తాజాగా నోటీసులు ఇవ్వటంతో అసలు గుట్టురట్టయింది. ప్రభుత్వం చేస్తున్నటువంటి పథకాలను తమ చేతి వాటంగా మలుచుకొని పొదుపు సంఘం లీడర్లు, యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్స్, బ్యాంకు సిబ్బంది కొంత మంది కుమ్మక్కై నకిలీ పొదుపు సంఘాలను సృష్టించి కోట్ల రూపాయలు స్వాహా చేశారు. అవినీతి బయటపడటంతో రజియా అనే యానిమేటర్ ఆత్మహత్యాయత్నం చేసి మెప్మా సిబ్బంది వేధింపులకు గురి చేస్తున్నారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరోవైపు రజియా నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి ఒక్కొక్కరి పేరుతో రూ.2 లక్షలు రుణం తీసుకుని రూ.10 వేలు చేతిలో పెట్టిందని సభ్యులు వాపోతున్నారు. తాజాగా బాధితులు పోలీసులు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందిస్తున్నారు.

ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి

పట్టణంలోని పలు గ్రూపులలో మహిళలకు తెలియకుండా వారి పేర్లతో ఆయా బ్యాంకుల్లో రుణాలు తీసుకొని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని గతంలో ఫిర్యాదులు అందటంతో దీని మీద అప్పటి మున్సిపల్ అధికారులు, మెప్మా విభాగం అధికారులు విచారణకు ఆదేశించారు. ఆ విచారణ పూర్తి కాక ముందే అనేక వార్డుల నుంచి రోజురోజుకు పలు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఇంకా ఎంత మంది పేర్ల మీద తెలియకుండా బ్యాంకులలో రుణాలు తీసుకున్నారోనని మహిళలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా పట్టణంలోని 32వ వార్డుకు చెందిన సైకం మేరీ అనే మహిళ 24వ వార్డులోని ఆర్పీ రజియా వద్ద జ్యోతి పొదుపు గ్రూప్ ఏర్పాటు చేసి అగ్రికల్చర్ కళాశాల ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంకులో రుణం తీసుకుంది. తనకు తెలియకుండా రూ.2 లక్షలు రుణం తీసుకొని రూ.10 వేలు లోన్ వచ్చిందని చెప్పి అందులో కూడా రూ.500 కరీమ అనే గ్రూప్ లీడర్ తీసుకుని రూ.9500 ఇచ్చిందని బాధితురాలు మేరీ వాపోతోంది. ఇటీవల ఆర్పీ రజియాని లీడర్ కరీమ నిలదీయడంతో మరో రూ.15 వేలు కరీమ తనకు ఇచ్చిందని మిగిలిన డబ్బులు నాకు సంబంధం లేదని.. ఆర్పీ తీసుకుందని సమాధానం చెప్పిందని బాధితురాలు మేరీ పేర్కొంది.

సభ్యులు ఎవరో తెలియదు

గ్రూప్‌లో సభ్యులు కూడా ఎవరెవరో తెలియదని వారు ఆధార్ కార్డు తీసుకొని గ్రూప్ తయారు చేశారని మేరీ అధికారులకు తెలిపింది. 24వ వార్డులో సుమారు 17 గ్రూప్‌లు ఉన్నట్లు మెప్మా సిబ్బంది రిపోర్ట్ తయారు చేసి కమిషనర్‌కు సమర్పించినట్లు తెలిసింది. గతంలో పని చేసిన సీఓ, ఆర్పీ, బ్యాంకర్లు ప్రమేయంతో ఇటువంటి ఫేక్ గ్రూప్‌లు తయారు చేసి కోట్ల రూపాయలకు గండి కొట్టినట్లు మహిళలు గుసగుస లాడుకుంటున్నారు. ఒక్క ఏడాదిలోనే ఇంత పెద్ద మొత్తంలో ఒక్క ఆర్పీ ఆధ్వర్యంలో అవినీతి జరిగితే పట్టణంలోని 34 వార్డులలో ఇంకా ఎంత అవినీతి జరిగి ఉంటుందోనని అంచనాకు వస్తున్నారు. ఇది ఇలా ఉంటే వారు చేసిన అవినీతి ఎక్కడ బయట పడుతుందో అని ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులను కలుసుకొని నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు విచారణ జరిపితే పట్టణంలో ఎన్ని గ్రూప్‌లు ఉన్నాయో ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో తెలుస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విచారిస్తున్నాం



మహిళా గ్రూపు సభ్యురాలు సమస్యను తమ దృష్టికి తీసుకు వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విచారణ చేపట్టాం. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా ఉండటం కోసం ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌ను ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. పట్టణంలో 2 వేల పొదుపు సంఘాలు ఉన్నాయి. వాటిని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో నమోదు చేస్తున్నాం. అలా నమోదు చేస్తే ఒక గ్రూపులో సభ్యులు మరో గ్రూపులో ఉండటానికి వీలు ఉండదు. ఇప్పటికే పట్టణంలోని 90 శాతం గ్రూపుల నమోదు పూర్తయింది. ఈ నెలాఖరు నాటికి 10 శాతం గ్రూపుల నమోదు పూర్తవుతుంది. గతంలో జరిగిన అవినీతి ఆరోపణలపై ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. విచారణ చేసి నివేదిక అందజేస్తారు. అప్పట్లో నేను బాధ్యతల్లో లేను. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఎన్.సుబ్రహ్మణ్యం, మెప్మా అధికారి

గులియన్ బారి సిండ్రోంపై అవగాహన తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె రూరల్: గులియన్ బారి సిండ్రోం వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గోలియన్ బారి సిండ్రోం నాడీ సంబంధిత వ్యాధి అని, దీంతో నరాల బలహీనత, శరీరంలో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లటం వంటి సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. ఈ వ్యాధి కలుషితమైన ఆహారం, నీరు తాగటంతో వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రజలు పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు మాత్రమే తీసుకోవాలని, నిల్వ ఉన్న పదార్థాలు తీసుకోరాదన్నారు. వ్యాధి బారిన పడిన వారికి చేతుల్లో, కాళ్లల్లో నిస్సత్తువ కలిగి తిమ్మిర్లు వ్యాపిస్తాయని, నరాల నొప్పి, నిలబడటం కష్టంగా ఉండటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే సంబంధిత ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే నివారణ సులువవుతుందన్నారు. భోజనంకు ముందు చేతులను శుభ్రపరుచుకోవటం, కాచి చల్లార్చిన నీటిని తాగటం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం వంటివి ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపుకు కృషి చేయాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

రేపల్లె రూరల్: రాజకీయాలకు అతీతంగా ప్రజల పక్షాన పోరాడే లక్ష్మణరావును శాసన మండలి సభ్యుడిగా గెలిపించుకోవాల్సిన అవసరం పట్టభద్రులపై ఎంతైనా ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శాసనమండలిలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల కోసం పది స్థానాలు కేటాయిస్తే ఆ స్థానాల్లో వారికి ప్రాతినిధ్యం కాకుండా బలమైన కార్పొరేట్ వ్యక్తులు కూడా పోటీచేస్తున్నారని విమర్శించారు. పీడీఎఫ్ పేరుతో గత 14 సంవత్సరాల నుంచి రాష్ట్రంలో ప్రజల పక్షాన అనేక అంశాలపై శాసనమండలిలో మాట్లాడుతున్న లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతాంగ పోరాటాలలో నేరుగా పాల్గొంటూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న లక్ష్మణరావుకు పట్టభద్రులు అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు వై.నవీన్, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ వై.కిషోర్, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు బీఎల్‌కే ప్రసాద్, కే వెంకట్, కే ఆశీర్వాదం, కే రమేష్, డి.అగస్టీన్, కేవీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ఇళ్ల స్థలాల అర్జీలన్నీ పరిశీలించి పట్టాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

బాపట్ల : ఇళ్ల స్థలాలు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్న పేద ప్రజల అర్జీలన్నీ పరిశీలించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తెలిపారు. సీపీఐ బాపట్ల జిల్లా కార్యాలయంలో మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏటగిరి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ నివాసయోగ్యం కొరకు పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నేటికి పూర్తిస్థాయిలో ఇంటి పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి హోదాలో ప్రకటించిన విధంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తెలిపారు. అదేవిధంగా ఇంటి నిర్మాణ సామగ్రి పెరిగిన ధరలు దృష్టిలో ఉంచుకుని రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ఇళ్ల స్థలాలు కేటాయించే ప్రదేశాల్లో వసతులు కల్పించాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో వలసలు నివారించి గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు చేపట్టాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తులకు స్పందించిన జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి, ప్రభుత్వ యంత్రాంగానికి జల్లి విల్సన్, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు కేటాయింపులపై సీపీఐ చేపట్టిన కార్యక్రమం మార్చి 15వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై వామపక్ష జాతీయ పార్టీల పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీ వరకు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాజ్యాంగం ప్రజాస్వామ్యం లౌకికవాదం పరిరక్షణకై సామాజిక న్యాయం కోసం మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు జిల్లాలో జాతాలు, ర్యాలీలు, సెమినార్లు, బహిరంగ సమావేశాలు, సభలను చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలని జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు, బీసీ, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో బాపట్ల జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, చిరమల ప్రకాశ్‌బాబు, బత్తుల శామ్యూల్, జె.రత్నకుమారి, మేడా వెంకట్రావు, జేబీ శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జల్లి విల్సన్

వలసలు నివారించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు

గణపవరం(కర్లపాలెం): గ్రామాలలో పేదలు పనుల కోసం వలస వెళ్లిపోకుండా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని ఎంపీడీవో ఆద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. గణపవరం గ్రామంలో మంగళవారం జరిగిన ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేయటం వలన కూలి గిట్టుబాటు వస్తుందని చెప్పారు. ప్రతి కూలీ 24 అడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పు, అడుగు లోతు ఉండే విధంగా కాలవల మరమ్మతులు చేయాలని సూచించారు. అనంతరం గణపవరం గ్రామ సచివాలయాన్ని, ఆధార్ సెంటర్‌ను ఎంపీడీవో సందర్శించారు. సమస్యలపై గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు సరైన సమాధానం చెప్పినకాలంలో సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

తెనాలిరూరల్: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 50 నుండి 55 ఏళ్ల దామర్ల ప్రకాశరావు పట్టణ రామలింగేశ్వరపేట రాజుల కాలనీలో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు మంగళవారం రాత్రి సమాచారమిచ్చి వెళ్లి చూడగా బాత్రూమ్‌లో పడి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆళ్ల'కు కవితా పురస్కారం



తెనాలి: ఎలైట్ రైటర్స్ అసోసియేషన్ నిర్వహించిన కవితల పోటీలో పట్టణానికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు కవిత 'మాతృభాష మాధుర్యం'కు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ప్రతిభావంతులైన రచయితలు, కవులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎలైట్ రైటర్స్ సంస్థ 300 పైగా కవులు, రచయితలతో సాహిత్య పోటీలను కొనసాగిస్తోంది. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్, నిర్వాహకులు కె.పద్మావతి, కె.విద్యుల్లత, టి.సాధనకు ఆళ్ల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

తెనాలిరూరల్: మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.రాజశేఖర్ పోలీసులకు సూచించారు. పోలీసుల అధికారులతో తన చాంబర్‌లో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నిటినీ అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. వన్ టౌన్, టూ టౌన్. త్రీ టౌన్, బాపట్ల జి వేమూరు, కొల్లూరు. చుండూరు, అమృతలూరు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాల్సిందే

ఆర్డీవో రామలక్ష్మి



మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ తూచా తప్పక పాటించాలని రేపల్లె ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడారు. ఇప్పటికే డివిజన్ పరిధిలోని అన్ని పట్టణ, గ్రామాలలో రాజకీయ నాయకులతో కూడిన పోస్టర్‌లు, ఫ్లెక్సీలను తొలగించటం జరిగిందన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తిరునాళ్ల నిర్వహించే ప్రదేశాలలో రాజకీయ నాయకుల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలు, జెండాలను ఏర్పాటు చేయరాదన్నారు. ప్రభలపై సైతం రాజకీయ నాయకుల ఫొటోలను ముద్రించరాదని, రాజకీయ నేపథ్యం కలిగిన పాటలను వాడరాదని పేర్కొన్నారు. తిరునాళ్లలో మ్యూజికల్ నైట్ పేరుతో ఎటువంటి రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేయరాదన్నారు. తిరునాళ్లలో అల్లర్లు సృష్టించినా, గొడవలకు దిగినా వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకొనబడునన్నారు. డివిజన్ పరిధిలోని గోవాడ, అరవపల్లి, మోర్తోట, కొత్తపాలెం గోకర్ణమఠం గ్రామాలలో ప్రసిద్ధ శివాలయాలు ఉండటంతో మహాశివరాత్రి రోజున భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఆయా ఆలయాలపై రెవెన్యూ, పోలీసు అధికారుల నిఘా ఉంటుందని, కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలి

ఏఓ మహేష్‌బాబు

చెరుకుపల్లి: రైతులు విశిష్ట సంఖ్య పొందటం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని ప్రయోజనాలు అందుతాయని మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు రైతులకు సూచించారు. మండలంలోని రాజవోలు, ఆళ్ళవారి పాలెం గ్రామాల రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో వేసిన మినుము, పెసర పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు ఏఓ పలు సూచనలు చేశారు. అనంతరం ఆళ్ళవారి పాలెంలో ఏపీఎఫ్ఆర్ (రైతు విశిష్ట సంఖ్య) నమోదు చేస్తున్న విధివిధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రవీణ్, దివ్య, రైతులు పాల్గొన్నారు.



రాజవోలులో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ మహేష్‌బాబు

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో కేసనశెట్టి సురేష్



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

బాపట్ల డిప్యూటీ డీఈవో సురేష్

రేపల్లె రూరల్: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబుద్ధుల్ని అందించాలని బాపట్ల డిప్యూటీ డీఈవో కేసనశెట్టి సురేష్ తెలిపారు. అంగన్‌వాడీలకు పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు, ట్రిబుల్ ఎస్ హైస్కూలులో మంగళవారం నిర్వహించిన జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏదైనా ఒక అంశం మదిలో చిరస్థాయిగా నిలిచిపోవాలంటే ఆ అంశాన్ని ప్రయోగ పూర్వకంగా చూస్తూ నేర్చుకోవాలని, ఆయా అంశాలను చిన్నారులకు ఆధారితం ద్వారా నేర్పాలని తెలిపారు. అంగన్‌వాడీలతో పాటు తల్లిదండ్రులు సైతం తమ చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి నడవడిక క్రమశిక్షణతో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీలు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో కే రత్నశ్రీధర్, హెచ్ఎం పుల్లారావు, సీడీపీవో ఎం.సుచిత్ర, సూపర్‌వైజర్ శివజ్యోతి, ఉపాధ్యాయులు సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ

జంపని(వేమూరు): అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల పాటు జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఐదు రకాల పౌష్టికాహారం అందించే విధానంపై ఆయన వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తల వల్ల పిల్లలకు క్రమ శిక్షణ వస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పిల్లలకు చదువుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాధవి, అమృత వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో శోభాచంద్

జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపట్నం: పూర్వ ప్రాథమిక విద్యావిషయాలపై జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలను అంగన్‌వాడీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఆర్.శోభాచంద్ తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీల బోధనా సామర్థ్యాలు పెంపొందించేలా 120 రోజుల శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీలు నిర్వర్తించాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శేషుగోపాలం, సీడీపీవో అనసూయ, డీఆర్‌పీలు గణేష్ రావు, తులసీదాసు, ప్రసూన్న, గౌరీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహా బృందనాట్యంలో తెనాలి చిన్నారులు



చిన్న జీయరుస్వామి నుండి జ్ఞాపికను స్వీకరిస్తున్న చల్లా యామిని



పతకాలతో తెనాలి చిన్నారులు

తెనాలి: శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో హైదరాబాద్ ముచ్చింతల్ లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతా కుంభ్-2025, మహా బృందనాట్యంలో తెనాలి చిన్నారులు పాల్గొన్నారు. ఈనెల 9వ తేదీ నుండి 19వ తేదీ వరకు సమతా కుంభ్-2025 శ్రీరామానుజాచార్య-108 దివ్యదేశాల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ప్రముఖ నృత్యగురువు ఘంటసాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు వేలమంది కూచిపూడి నృత్యకళాకారులతో జరిగిన మహాబృందం నాట్యంలో తెనాలికి చెందిన నృత్యగురువు చల్లా యామిని నలుగురు శిష్యులు భాగస్వాములయ్యారు. ప్రదర్శన అనంతరం శ్రీచినజీయరుస్వామి చేతులమీదుగా నృత్యగురువు చల్లా యామినికి జ్ఞాపికను బహూకరించారు. మహా బృందనాట్యానికి వచ్చిన నాలుగు రికార్డ్స్‌కు సంబంధించిన ధృవీకరణ పత్రాలను, పతకాలను చిన్నారులకు బహూకరించారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ మనసంప్రదాయ కళలను చిన్నారులకు నేర్పిస్తున్న తల్లిదండ్రులను స్వామి అభినందించారు.